ఆంధ్రజ్యోతి 14-10-09


ప్రొ.జి.హరగోపాల్

# జీవితమే ఒక ప్రయోగం

గాంధీ తన ఆత్మకథను 'సత్యాన్వేషణలో ప్రయోగాలు' అని పేర్కొన్నారు. మానవ సమాజంలో సమూహాలు సమష్టిగా ప్రయోగాలు చేస్తుంటాయి. కానీ వ్యక్తులు ప్రయోగాలు చేయడం అరుదు. ప్రకృతి శాస్త్రాల అధ్యయనానికి సామాజిక శాస్త్రాల కంటే మౌలికమైన తేడా అదే. ప్రకృతి శాస్త్రాల్లో ప్రయోగాలు ప్రయోగశాలల్లో చేస్తుంటారు. కాని మనుషుల మీద ప్రయోగాలు చేయడం సాధ్యం కాదు. కాని మనుషులు సమష్టిగా చేసే ప్రయోగాలే ఉద్యమాలు. సాధారణంగా వ్యక్తులు సామాజిక విలువలకు, ఆచారాలకు, సాంప్రదాయాలకు, విశ్వాసాలకు అనుగుణంగా జీవిస్తుంటారు. అవి సరియైనవి కావని తెలిసినా, అంతరాత్మకు అంగీకారం కాకున్నా బలమైన బాహ్య ప్రపంచానికి లొంగిపోవడమో, రాజీపడడమో జరుగుతుంది. కాని కొందరు అరుదైన వ్యక్తులు బయటి ప్రపంచంతో రాజీపడకుండా తాము ఏది విశ్వసిస్తారో దాన్నే ఆచరిస్తుంటారు. ఇలాంటి వ్యక్తులు మానవ నాగరికత మీద పెట్టుకున్న అన్ని విలువల సారానికి వ్యక్తీకరణగా సాక్షాత్కరిస్తారు. ఈ వ్యక్తులపట్ల బలవంతులకు, రాజ్యానికి ఆగ్రహం ఉంటుంది. ఈ ప్రవర్తన వ్యవస్థ పునాదులను కదిలిస్తుందని వాళ్ల భయం. అందుకే అలాంటి వ్యక్తుల మీద దౌర్జన్యం చేస్తుంటారు. ఆ దౌర్జన్యానికి నిర్భయంగా నిలబడ్డ వ్యక్తులే సామాజిక మార్పును వేగవంతం చేస్తుంటారు. ఆ కోవకు చెందిన అద్భుత మనిషే బాలగోపాల్. ఆయన బయటి ప్రపంచం పొగిడితే పొంగలేదు. విమర్శిస్తే కృంగలేదు. తనను వేధిస్తే భయపడలేదు. తాను సత్యమని నమ్మిన దాన్ని ఆచరిస్తూ ముందుకు సాగాడు. ఈ ప్రయోగం విలువను రాబోయే తరాలే సరిగా అంచనా వేస్తాయి.

జీవితంతో ప్రయోగం చేసే వాళ్లకు కొన్ని విశిష్ట, విలక్షణమైన లక్షణాలుంటాయి. ఒకటి వాళ్ళకు మరణమంటే భయం ఉండదు. ఆ సంసిద్ధత వాళ్లు చేసే సాహసాలకు మూల కారణం. ప్రాణమంటే అందరికి ప్రేమే. అయితే ప్రాణులందరూ నిండుగా అర్థవంతంగా బతకడానికి ఇప్పుడున్న వ్యవస్థలో సాధ్యపడదని, అది మారాలని కాంక్షించే తత్వవేత్తలు, సంస్కరణవాదులు, విప్లవకారులు మార్పు కొరకు పోరాడుతుంటారు. ఒక మానవీయ సమాజంకొరకు జరిగే అన్వేషణలో, సంఘర్షణలో ప్రయోగాలు అనివార్యమని జీవితంతోనే ప్రయోగం చేస్తారు. ఈ సాహస ప్రయోగాలు చేసే వ్యక్తులు సమాజం ముందుకుపోవడానికి దోహదపడతారు. ఈ క్రమంలో వాళ్ళు మరణాన్ని గురించి భయపడరు. చావు గురించి ఎప్పుడైనా ప్రస్తావన వస్తే, మనిషి ఎప్పుడైనా చనిపోతాడు, చనిపోవలసిందే కదా అని బాలగోపాల్ అనేవాడు. వ్యాస్ మీద దాడి జరిగినప్పుడు అనుకోకుండా బాలగోపాల్, నేను కణ్ణబీరన్‌ను కలవడానికి వెళ్లాం. అప్పటికే కొందరు పౌర హక్కుల నాయకులను కోల్పోయి ఉన్నాం. మరునాటి ఉదయం కణ్ణబీరన్ వారించినా వినకుండా ఏదో మీటింగ్ ఉంది వస్తానని ఒప్పుకున్నానని చెప్పి వెళ్లిపోయాడు. రాజ్యం మనిషి ప్రాణాన్ని తీసుకోవాలని తలిస్తే మనిషిని రక్షించడం చాలా కష్టం అని అంటూ మరొక సభకు వెళ్లి చావడమా, లేక వెళ్ళకుండా చావడమా అనేదే సవాలు అని అన్నాడు. ఒకసారి విజయవాడలో ఒక సభకు వెళితే మీడియా బాలగోపాల్‌ను భిన్నకోణాలనుంచి కెమెరాలో బంధించడానికి ప్రయత్నిస్తుంటే తెలుగు మీడియాలో నిరాశావాదం చాలా పెరిగింది అంటూ, తనను రాజ్యం చంపితే తన మరణవార్త లేదా నివాళి కాలం కొరకు ఫోటోలు తీస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. మరొక సందర్భంలో తనకు ఏదైనా నయంకాని జబ్బు వస్తే ఆదిలాబాదులో గోదావరి నది చాలా అందంగా ఉన్న ప్రదేశం ఒకటి ఉందని అక్కడ చస్తానని అన్నాడు. బట్రాండ్ రసల్ కూడా ఇలాగే మూడు నాలుగు సార్లు చావాలని నిర్ణయించుకున్నానని తన ఆత్మకథలో వ్రాసుకున్నాడు.

బాలగోపాల్ లాంటి వ్యక్తులు తాము చేసే ప్రయోగంలో శరీరాన్ని చాలా నిర్లక్ష్య భావనతో చూస్తారు. అది అందరికి చాలా తప్పు అనిపించినా అది వాళ్ల నైజం. ఆయనతో పనిచేసిన చాలామంది హక్కుల ఉద్యమ సభ్యులకు ఆయన తన శరీరాన్ని ఎంత బాధకు గురిచేశాడో తెలుసు. హింసకు వ్యతిరేకంగా పోరాడే మీరు మీ శరీరాన్ని చాలా హింసకు గురిచేస్తున్నారు, అది ఏదో ఒకరోజు తిరుగుబాటు చేస్తుంది అని అంటే నవ్వి ఊరుకునేవాడు. స్నానము, నిద్ర, ఆకలి, వేసుకునే బట్టలు, చెప్పులు, తలదువ్వుకొనడం ఇవేవీ ఆయనకు పట్టేవి కావు. షేవింగ్ చేసుకోవాలంటే ప్రయాణంలో షేవింగ్ సామాగ్రి దగ్గర ఉంటే మారణాయుధాలతో తిరుగుతున్నాడని ఏదో కేసులో పోలీసులు ఇరికించవచ్చు అని నవ్వేవాడు. ఒకసారి మండుటెండలో ఒక ఇసుక లారీ పోతుంటే దాంట్లో పడుకొని పోతే చాలా హాయిగా ఉంటుంది కదా అంటే చాలా ఆశ్చర్యపోయాను. మరొక సందర్భంలో గుంటూరులో ఒక సభకు ఇద్దరం వెళ్ళవలసుంది. తాను ఒకరోజు ముందే గుంటూరు బయలుదేరుతూ 'మీకు స్థలాలు సరిగా గుర్తుండవు కాబట్టి నేను ఉదయం రైల్వే స్టేషన్‌కు వస్తానని స్టేషన్‌కు వచ్చాడు. రాత్రి ఎక్కడ పడుకున్నారు అని అడిగితే మన మీటింగ్ పోస్టర్లను పట్టణంలో అతికిస్తూ గడిపానని అన్నాడు. ఒక పర్యాయం ఇద్దరం కలిసి మూడు నాలుగు రోజులు వరుసగా భిన్న ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు, ఉదయం ఒక అరటిపండు, మధ్యాహ్నం ఒక అరటిపండు, రాత్రికి రెండు తింటూ గడిపాడు. భోజనం చేయమని ఎంత బలవంతం చేసినా వినలేదు. కాని నా భోజనాన్ని గురించి తగు జాగ్రత్తలు తీసుకున్నాడు. ఈ నిర్లక్ష్యమే ఆయన ప్రాణాన్ని తీసుకుంది. కడుపులో అల్సర్ ముదిరి అది చిట్లుతున్న దశలో ఆయన సహచరి వసంత బలవంతం మీద డాక్టర్ దగ్గరికి స్కూటర్ నడుపుతూ వెళ్ళాడు. తన తీవ్ర బాధను చెప్పుకోకపోవడం వల్ల డాక్టర్ కూడా జబ్బు తీవ్రతను సరిగ్గా గుర్తించలేకపోయాడు. డాక్టర్లకు ఇలాంటి వ్యక్తులు కూడా ఉంటారని తెలియదు. బాలగోపాల్‌ని ఈ ఒక్క విషయంలో మాత్రం క్షమించలేం.




బాలగోపాల్ ప్రయోగంలో పౌరహక్కులపట్ల వచ్చిన నమ్మలేని మార్పు మరొక పార్శ్వం. నేను పౌరహక్కుల ఉద్యమంలో బాధ్యతలు తీసుకున్న తర్వాత, విప్లవ ఉద్యమాలతో సంబంధం పెట్టుకుంటే మంచిది అని సలహా ఇచ్చాడు. ఇవి రెండు ఉద్యమాలకు అవసరం అని భావించాడు. అదే బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమాలకు స్వతంత్ర కార్యక్షేత్రం ఉండాలని ప్రతిపాదించాడు. ఈ మార్పు 1990-91 ప్రాంతంలో ఆయనలో వచ్చిందని నేననుకుంటున్నాను. ఇది సోవియట్ యూనియన్ కూలిపోయిన క్రమంలో వచ్చి ఉండవచ్చు. నేను ఆ మాటంటే తాను అంగీకరించేవాడు కాదు. సోవియట్ యూనియన్ ఒక మార్క్సిస్టు సిద్ధాంత వెలుగులో ప్రపంచ చరిత్రను, మానవ పరిణామ దశను మార్చిన అద్భుత సంఘటన అని అందరం అనుకున్నాం. మానవాళికి పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి విముక్తి పొంది, ఒక ప్రత్యామ్నాయ గమ్యం ఆవిష్కరించబడుతున్నదని విశ్వసించేవాళ్ళకు ఈ పతనం సునామీలాగా తగిలింది. ఈ వైఫల్యానికి ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న కాలంలో బాలగోపాల్ సార్వజనీన నైతిక విలువల గురించి ఆలోచించి మాట్లాడడం ప్రారంభించాడు. దాంట్లో భాగంగానే మానవ ప్రవృత్తిమీద, మార్క్సిజం మౌలిక సూత్రీకరణల మీద చర్చ ప్రారంభించాడు.

ఆయన జీవితంలో, ఆచరణలో అదొక కొత్త ప్రారంభం. అంతకాలంగా తాను విశ్వసించిన విశ్వాసాలకు పనిచేసి మళ్లీ కొత్త ప్రశ్నలతో-ప్రతిపాదనలతో కార్యాచరణ ప్రారంభించాడు. అలా అని ఆయన అంతకాలంగా సమర్థించిన ఉద్యమాలను తిరస్కరించలేదు. వాటిమీద ఒక విమర్శ మాత్రమే పెట్టాడు.

నాకు తెలిసినంత వరకు ఉద్యమాల మీద విమర్శే కాని తిరస్కార భావం లేదనడానికి ఎన్నెనా ఉదాహరణలున్నాయి. ఆ మధ్య ఒక టీవీ చానల్ వాళ్ళు విప్లవ ఉద్యమాలు దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయి కదా అని అడిగితే అది మంచిదే కదా అని అన్నాడు. ఆయన పెట్టిన విమర్శకి పీపుల్స్‌వార్ పార్టీ ఒక పుస్తకమే వేసింది. ఆ పుస్తకాన్ని బాలగోపాల్‌కు నేనే ఇవ్వవలసి వచ్చింది. ఆయన ఆ పుస్తకాన్ని చాలా ఆసక్తిగా చూస్తాడేమోనని ఆశించిన నాకు ఆయన దానిని తెరవకుండా పక్కకు పెట్టి నేను వ్యాసం రాసింది వాదించడానికి కాదు వాళ్ల ఆచరణ మెరుగుపడడం కొరకు అన్నప్పుడు నేను చాలా ఆశ్చర్యపోయాను. మరొక సందర్భంలో మీ వ్యాసాన్ని రాజ్యం దురుపయోగం చేస్తున్నది అన్నప్పుడు 'ఆ వ్యాసం మరెవరైనా వ్రాస్తే బావుండేది' అన్నాడు. విప్లవ ఉద్యమాలకు ఒక సమగ్రమైన మానవీయ నైతిక చట్రం ఉండాలన్న అంశాన్ని ఆయన చాలా బలంగా విశ్వసించాడు.

ప్రాణులందరూ నిండుగా అర్థవంతంగా బతకడానికి ఇప్పుడున్న వ్యవస్థలో సాధ్యపడదని, అది మారాలని కాంక్షించే తత్వవేత్తలు, సంస్కరణ వాదులు, విప్లవకారులు మార్పు కొరకు పోరాడుతుంటారు. ఒక మానవీయ సమాజంకొరకు జరిగే అన్వేషణలో, సంఘర్షణలో ప్రయోగాలు అనివార్యమని జీవితంతోనే ప్రయోగం చేస్తారు. ఈ సాహస ప్రయోగాలు చేసే వ్యక్తులు సమాజం ముందుకుపోవడానికి దోహదపడతారు.

తన ప్రాపంచిక దృక్పథంలో నైతిక విలువల కోణం చేరిన తర్వాత ఏ సమస్యను చూసినా ఆ కోణం నుండే చూశాడు. ఉద్యమాలు కూడా ఆ కోణం నుండి చూడాలని ఆశించాడు. ఆ విలువలను తాను తన నిత్య జీవితంలో పాటిస్తూ వాటి సాధ్యాసాధ్యాలను పరీక్షిస్తూ వచ్చాడు. ఉద్యమాలు న్యాయ భావనను వదలకూడదని అంటూ పౌరహక్కుల లేదా మానవ హక్కుల ఉద్యమం ఆ నైతిక పునాది మీద నిర్మాణం కావాలని ప్రతిపాదించాడు. అప్పుడే పౌరహక్కుల ఉద్యమం సామాజిక సంఘర్షణకు, అన్నిరకాల ప్రజాఉద్యమాలకు ప్రయోజనకరంగా ఉంటుందని అప్పుడే మానవ విలువలు ఉన్నతీకరించబడతాయని, పౌరహక్కుల కార్యకర్తలకు మరింత స్పష్టమైన కార్యాచరణ సాధ్యమవుతుందని అనేవాడు.

అయితే ఈ మానవీయ ప్రయోగం విలువ సాధ్యాసాధ్యాలను బేరీజు వేయడం ఇప్పటికిప్పుడే సాధ్యం కాదు. ఢిల్లీలో జరిగిన ఒక సంఘటనతో దీనిని ముగిస్తాను. ఢిల్లీలో పియుడి ఆర్ నిర్వహించిన సభలో బాలగోపాల్ ఉపన్యసించిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో బోధిస్తున్న సుదీప్తో (ఇతను అంతర్జాతీయ ప్రఖ్యాతి కలిగిన రాజనీతి శాస్త్ర ఆచార్యులు) ప్రొ. రణధీర్‌సింగ్‌తో 'ఈ మనిషి మాట్లాడడం చూస్తే పర్వాలేదు అనిపిస్తుంది' (this man talks some sense) అన్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన రణధీర్‌సింగ్ సుదీప్తో నీవు నేను దేహం ముగించిన నాడే మన అస్తిత్వం కూడా ముగుస్తుంది. బాలగోపాల్ భవిష్యత్తు తరాలను ప్రభావితం చేసి జనం జ్ఞాపకాలలో వాళ్ల ఆచరణలో మిగిలిపోతాడు' అని అన్నాడు. రణధీర్‌సింగ్ స్వయాన నాకీ విషయం చెప్పాడు. బహుశా బాలగోపాల్ గురించి, ఆయన మానవీయ ప్రయోగం గురించి ఇంతకంటే మించిన అంచనా ఏం ఉంటుంది?

(వ్యాసకర్త ప్రముఖ సామాజిక వేత్త)